క్లుప్తంగా

సీఎంఏ ఫలితాలలో 12వ ర్యాంకు



జగ్గయ్యపేట:జాతీయ స్థాయి సీఎంఏ ఫలితాలలో పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన కూచి నాగిని 12వ ర్యాంకు సాధించింది. గుంటూరులోని ఓ ఇనిస్టిట్యూట్‌లో సీఎంఏ చదువుతున్న నాగిని బుధవారం వెలువడిన ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించారు. విద్యార్థినిని గ్రామస్తులు, ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు అభినందించారు.

కంప్యూటర్ బహూకరణ

లింగాలపాడు(నందిగామ రూరల్):మండలంలోని లింగాలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకట లక్ష్మి సాయిబాబు తనతండ్రి మోహనరావు జ్ఞాపకార్థం గురువారం రూ.20 వేల విలువ చేసే కంప్యూటర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

టెండర్ వేలం వాయిదా

అంబారుపేట(నందిగామరూరల్):మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించాల్సిన టెండర్ కం బహిరంగ వేలం పాటలు వాయిదా పడినట్లు ఈఓ హరి గోపీనాథ్ తెలిపారు. అమ్మవారి ఫొటోఫ్రేమ్‌లు, స్టిక్కర్లు విక్రయించుకునే హక్కు, పొంగలి షెడ్డు నిర్వహణ హక్కులకు వేలం నిర్వహించాల్సి ఉండగా పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి వేలం తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

బాలుర హాస్టల్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల 'నిర్లక్ష్యపు నీడలో బాలుర వసతి గృహం' శీర్షికన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి ఆశాఖ అధికారులు స్పందించారు. మరమ్మతులకు సుమారుగా రూ.11లక్షలు మంజూరు చేశారు. ఈనిధులతో హాస్టల్‌లో డైనింగ్ హాల్‌ను విద్యార్థులు ఉండేందుకు వీలుగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తున్నారు. బోరు వేయడంతోపాటు మరుగుదొడ్లకు మరమ్మతులు, రన్నింగ్ వాటర్ సదుపాయం తదితర పనులు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఈ హాస్టల్ విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని హాస్టల్ వార్డెన్ స్వామి తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

జగ్గయ్యపేటఅర్బన్:ఈనెల 16వ తేదీన విజయవాడలో జనసేనపార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొఘల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలంతా హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బాడిశ మురళీకృష్ణ, ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

కంచికచర్ల: గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెరిగేలా ఫీల్డ్‌అసిస్టెంట్లు శ్రద్ధ తీసుకోవాలని ఏపీఓ రమాదేవి సూచించారు. స్థానిక జాతీయ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇంకుడు గుంతల నిర్మాణం భారీస్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా ఇంకుడు గుంతల నిర్మాణాలు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు.

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద గురువారం దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురువారం ఉదయం దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మల్లేశ్వరస్వామి వారి దర్శనం అనంతరం భక్తులు దక్షిణామూర్తిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ

- వృథాగా పోతున్న తాగునీరు
- 15రోజులుగా ఇదే దుస్థితి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నందిగామలో స్వరాజ్ ట్రాక్టర్ షోరూం వద్ద లీకేజీకి గురైన తాగునీటి పైపులైన్

నందిగామరూరల్: ప్రతినీటి బొట్టు విలువైనదే...ప్రతి నీటిచుక్కను ఒడిసి పట్టు.. ఇవి తాగునీటిని వృథా చేయవద్దంటూ పాలకులు, అధికారులు నిత్యం వల్లెవేసే సూక్తులు కాని ఆచరణలో మాత్రం ఆ సూక్తులు తమకు వర్తించవు అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. అందుకు అనాసాగరం వెళ్లేరోడ్డులోని వజినేపల్లి గార్డెన్స్ సమీపంలో జాతీయ రహదారిపై పైపులైన్ లీకేజీకి గురై తాగునీరు వృథాగా పోతుండటమే నిదర్శనం.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

పట్టణంలోని అనాసాగరం, పరిసర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ 15రోజుల కిందట లీకేజీకి గురైంది. వజినేపల్లి గార్డెన్స్ సమీపంలోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూం ఎదురు ఈ తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి గురై తాగునీరంతా జాతీయ రహదారిపై ప్రవహిస్తోంది.

ఈ పైపులైన్ లీకేజీపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పైప్‌లైన్ లీకేజీ ప్రాంతానికి సమీపంలో దిబ్బలుండటంతో తాగునీరు కలుషితమవుతుందేమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి ప్రచార నేపథ్యంలో ఇటువంటి కలుషితనీరు తాగితే ఆరోగ్యం దెబ్బతింటుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో వాహనచోదకులు..

పైపులైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతున్న నీరంతా జాతీయరహదారిపై ప్రవహిస్తుండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ నీటి కారణంగా వాహనాలు ఎక్కడ ప్రమాదానికి గురవుతాయోనని ద్విచక్రవాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని వాహనచోదకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పైపులైన్ లీకేజీతో హైవేపై వృథాగా పోతున్న తాగునీరు

లీకేజీని అరికట్టాలి..



అనాసాగరంనకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీకి గురికావడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. పైప్‌లైన్ పక్కనే దిబ్బ ఉండటంతో వచ్చే అరకొర తాగునీరు సైతం కలుషితమవుతుందని భయంగా ఉంది. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలి.

గోపి, అనాసాగరం

నీరు వృథా కాకుండా చూడాలి..



పైపులైన్ లీకేజీ కారణంగా రోజుల తరబడి తాగునీరు వృథా అవుతోంది. పైపులైన్ లీకేజీతో జాతీయ రహదారిపై నీరు పారుతుండటంతో ఆప్రాంతమంతా బురదమయమవుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పైపులైన్ లీకేజీని అరికట్టి తాగునీరు వృథా కాకుండా చూడాలి.

సింగంశెట్టి మల్లికార్జునరావు, నందిగామ

సేకరించిన స్థలంలోనే ఆస్పత్రిని నిర్మించాలి

మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



జీవో కాపీ చూపిస్తూ మాట్లాడుతున్న డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

నందిగామటౌన్(నందిగామరూరల్): నందిగామలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన ప్రదేశంలోనే 100 పడకల ఆస్పత్రిని నిర్మించడం సముచితమని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నందిగామలోని 50పడకల ఆస్పత్రినే 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 100 పడకల ఆస్పత్రికి సంబంధించి రూ.34.48 కోట్ల నిధులు, ఆస్పత్రి సిబ్బంది సంఖ్యను 52మందికి పెంచుతూ 2023 మార్చిలోనే గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఆస్పత్రిని వారి ఖాతాలో వేసుకోవాలనుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అత్యవసర, ప్రాణాపాయ స్థితిలో ప్రతి సెకను.. ప్రతి నిముషం ఎంతో విలువైనదనే అంశాన్ని గుర్తించాలన్నారు. ప్రస్తుత వైద్యశాలను 100పడకల ఆస్పత్రిగా మార్చితే అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ట్రాఫిక్ సమస్య కారణంగా విలువైన ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను అనేకం చూస్తున్నామన్నారు. నందిగామ నియోజకవర్గ ప్రజల అవసరాల దృష్ట్యా 100 పడకల ఆస్పత్రి ఉంటే భవిష్యత్‌లో వైద్య కళాశాలగా అభివృద్ధి చెందే అవకాశముంటుందని ఉద్దేశంతోనే తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదెకరాల స్థలాన్ని సేకరించి ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. ఇప్పుడున్న వైద్యశాల 100 పడకల ఆస్పత్రికి అనుకూలమైనది కాదని ఐదెకరాల స్థలమైతే బావుంటుందని రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సూచించడంతో ఆ మేరకు స్థల సేకరణ చేశామన్నారు. నందిగామకు 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించిందెవరో ప్రజలందరికీ తెలుసునని, ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. ప్రజల వైద్య అవసరాలు, భవిష్యత్ అభివృద్ధికి ఊతమిచ్చేలా 100 పడకల ఆస్పత్రిని నిర్మించాల్సి ఉందన్నారు.

నందిగామలో విధ్వంసక పాలన...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నందిగామలో విధ్వంసక పాలన సాగుతోందని జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్షసాధింపులు.. తప్పుడు కేసుల నమోదుకు నందిగామ చిరు నామాగా మారిందని విమర్శించారు.ప్రజాప్రతినిధులే ఎస్సీ అట్రాసిటీ చట్టాలను అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కేవలం దొంగ కేసులు పెట్టడానికే వినియోగిస్తుండటం దురదృష్టకరమన్నారు. ఎవరి మీద అక్కసుతో సేకరించిన స్థలంలో కాకుండా ప్రస్తుతమున్న ఆస్పత్రినే 100 పడకల ఆస్పత్రిగా ఎందుకు అభివృద్ధి చేయాలనుకుంటున్నారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. తమ హయాంలో సేకరించిన స్థలంలో 100 పడకల ఆస్పత్రిని నిర్మిస్తే పేదలు, బడుగు, బలహీన వర్గాలు ఉన్న 17,18వ వార్డులు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేకనే ఆస్పత్రిని అక్కడ నిర్మించడం లేదేమోననే అనుమానం కలుగుతోందన్నారు. అన్ని రకాలుగా అనువుగా ఉండే 17వ వార్డు పరిధిలో సేకరించిన స్థలంలోనే 100 పడకల ఆస్పత్రిని నిర్మించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డాక్టర్ జగన్ మోహనరావు డిమాండ్ చేశారు.

వల్లభనేని వంశీ అరెస్ట్ అక్రమం: తన్నీరు



చిలకల్లు టోల్‌ప్లాజా వద్ద మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ అక్రమమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వంశీని అక్రమంగా అరెస్ట్ చేసి హైదరాబాద్ నుంచి విజయవాడ తీసుకువస్తుండగా గురువారం సంఘీభావం తెలిపేందుకు ఆయన పార్టీ శ్రేణులతో కలిసి చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్దకు వచ్చారు. ఈసందర్భంగా తన్నీరు విలేకరులతో మాట్లాడుతూ వంశీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై ఘటనపై ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ తన ఫిర్యాదును వెనక్కు తీసుకున్నారన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో వంశీని ఇబ్బందిపెట్టాలని చూస్తుండటం తగదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సంక్షేమ పథకాల ఊసెత్తకుండా అక్రమ అరెస్ట్‌లు చేయడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, నిస్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతున్నారని ఆరోపించారు. తన్నీరు వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పట్టణ కన్వీనర్ వట్టెం మనోహర్, పార్టీ ఉపాధ్యక్షుడు ఉప్పెల్లి పెంటయ్య, దుర్గగుడి మాజీ డైరెక్టర్ నంబూరి రవికుమార్, నాయకులు సంపత హుసేన్, శివాజీ, నరసింహారావు, రూపన పుల్లయ్య, బుల్లయ్య ఉన్నారు.

మాజీఎమ్మెల్యే వంశీ అరెస్ట్ దారుణం..

కంచికచర్ల: మాజీఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ కంచికచర్ల మండల కన్వీనర్ బండి మల్లికార్జునరావు, పట్టణ కన్వీనర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజినీ శ్రీనివాస్ అన్నారు. వారు గురువారం మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని, సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నాయకులు అధికారం వచ్చాక ఇలా నాయకులపై అక్రమ కేసులు పెట్టడం తగదని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీటీసీ సభ్యులు మాదుగుల మధుబాబు, కర్ల రాధిక, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, పాపట్ల సీత, పిల్లి భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



ముక్త్యాల(జగ్గయ్యపేట): వాహనచోదకులు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని ఎంవీఐ నారాయణరాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ముక్త్యాలలోని కేసీపీ సిమెంట్ కర్మాగారంలో డ్రైవర్లకు గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు క్రాస్ చేసే సమయంలో నిబంధనలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. రోడ్లపై ఉండే గుర్తులకు అనుగుణంగా వాహనాలను నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటించకుంటే ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా అధిక లోడుతో వెళ్లే డ్రైవర్లు రాత్రి వేళల్లో నిద్ర వస్తే తప్పనిసరిగా వాహనాలను రోడ్డుపక్కకు నిలుపుదల చేసి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేసీపీ ప్రతినిధులు అనిల్‌కుమార్, నాగేంద్రకుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 71 మంది విద్యార్థులకు గురువారం 'సాక్షి' దినపత్రిక సౌజన్యంతో అందజేసిన గణితం, సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు వివరించారు.

సమ్మర్ క్యాంప్ బ్రోచర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక చిల్లకల్లు రోడ్డులోని వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మార్చి 17వతేదీ నుంచి ప్రారంభించనున్న సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం విడుదల చేశారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ యువత ఈ అకాడమీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, లాలి మాస్టారు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరంగనాయకుని కల్యాణోత్సవం



శ్రీరంగనాయక స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీభూగోదా సమేత రంగనాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీరంగనాయకునితో శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో బృందావనం నరసింహాచార్యులు యాజ్ఞిక నిర్వహణలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన మహాసంకల్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త శ్రీరాం బదరీనారాయణ, శ్రీరాం రాజగోపాల్ దంపతులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.జయప్రకాష్, శ్రీరాం సుబ్బారావు, వివేకానంద, చేగు బదరీనారాయణ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లింగాలపాడులో..

లింగాలపాడు(నందిగామరూరల్):మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామివారి దివ్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణనిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, స్టేట్ కోఆర్డినేటర్ వనజ, మోహన్‌సందీప్, శ్రీనివాస్

పెనుగంచిప్రోలు: సమగ్ర శిక్ష, జిల్లా పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ప్రైభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సహిత విద్యపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నీతి అయోగ్‌లో భాగంగా ఆస్పిరేషన్ బ్లాక్ మండలమైన పెనుగంచిప్రోలులో దివ్యాంగ విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వ సహాయ సహకారాలు, ఉపకార వేతనాలు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. దివ్యాంగులను గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పిరేషనల్ బ్లాక్ రాష్ట్ర కోఆర్డినేటర్ వనజ, జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, మండలాల కోఆర్డినేటర్స్ మోహన్ సందీప్, శ్రీనివాస్, ఎంఈఓ రవీంద్ర, భవిత సెంటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి, పక్కన మాధురి, ఉషారాణి

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):చిరుధాన్యాల్లో అత్యంత పోషక విలువలు ఉంటాయని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో గురువారం పోషణ్ బి పడాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ వ్యాధులు నివారణ, చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీసీ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ మండలంలో 43 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి మాధురి మాట్లాడుతూ పిల్లలకు ఆహారం ఇచ్చే విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిపొడి చెత్తను విడివిడిగా సేకరించాలి



నందిగామటౌన్(నందిగామరూరల్):పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య పారిశుద్ధ్య విభాగ సిబ్బందికి స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛదివస్‌పై గురువారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో మూడో శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. పట్టణ ప్రజలు కూడా పారిశుద్ధ్య సిబ్బందికి తడి,పొడి చెత్తను అందించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణోత్సవాలు



నందిగామటౌన్(నందిగామరూరల్):పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు చేశారు. పూర్ణాహుతి, వసంతోత్సవం, ధ్వజారోహణ, సహస్రకర దీపోత్సవం, దొంగల తోపు ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో గంగాధర్, అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి మురళీరాఘవకుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఉదయ పొంగళ్లు నివేదన



ఉదయ పొంగళ్లు కార్యక్రమంలో ఈవో కిషోర్‌కుమార్, ఈఈ



అమ్మవారి ఒగ్గుకథ చెబుతున్న బైండ్లవారు



ఒత్తులు వెలిగించి ప్రదక్షిణలు చేస్తున్న ఐదు వంశీకులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మూడోరోజు గురువారం అంకమ్మ క్రతువుల్లో భాగంగా శాలివాహనులు ఉదయ పొంగళ్లు చేసి అమ్మవారికి, సహదేవతలకు నివేదించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి, పాలుపొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆచారం ప్రకారం జలబిందెలు మోసిన వారు ఇత్తడి తాంబూలాల్లో మూడు ఒత్తులు వెలిగించి ప్రధాన ఆలయంతోపాటు సహదేవతామూర్తుల ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం బైండ్ల వారితో ఒగ్గుకథ చెప్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఈఈ ఎల్.రమ, ఏఈ రాజు, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.